
# మాటున దాగే మాణిక్యాలు




వై. కె. మూర్తి

పెరటివైపు గుమ్మం దగ్గర కూర్చుని పుస్తకం చదువుతూ మధ్య మధ్య కళ్ళెత్తి కుతూహలంగా, తమ కాంపౌండునానుకుని వున్న ఖాళీ స్థలంలో, పాకవైపు చూస్తోంది శాంతమ్మ. పాకముందు కూర్చుని పిల్లవాడిని ముద్దుచేస్తూ ఏవేవో వూసులాడుకుంటున్నారు లక్ష్మి, రాముడూ వాళ్ళముఖాలలో తాండవించే ఆతృప్తికీ, ఆ సంతోషానికీ ఎవరూ విలవకట్టలేరనిపిస్తుంది. రాముడు రిక్షాతొక్కి సంపాదిస్తాడు. లక్ష్మి నాలుగిళ్లలో పాచిపని చేస్తుంది. ఇద్దరూ ఎప్పుడూ గల గలలాడ్తు కన్పిస్తారు. లక్ష్మికి శుభ్రత ఎక్కువ. రోజుకి రెండుసార్లు పాక ముందు చిమ్మి కళ్లాపిచల్లుతుంది. ఇంతింత ముగ్గులేస్తుంది. పాత చీరలైనా పొందిగ్గా కట్టుకుంటుంది. ఆమె తలరేగగా తనెన్నడూ చూడలేదు. బీదరికంలో కూడా ఆనందాన్ని వెదుక్కునే లక్ష్మంటే శాంతమ్మకిష్టం. అందుకే ఏదీ తనంతట తానడగదు. ఇచ్చింది తృప్తిగాతీసుకుంటుంది, ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తుంది.

# ఇదే... ఇదొక్కటే !

లేమిలో వున్న చెలిమి
కలిమిలో వుండదు
తోబుట్టువులైనా తోటివారైనా
మనిషి వున్నప్పుడు తెలియవు మనిషి విలువలు
లేమిలో ఐకమత్యం ఎందుకంటే
అందరి అవసరాలూ ఒక్కటే
కలిమిలో కలహాలు ఎవరిగోల వారిదే
పోటీలూ పోల్చుకోవడాలూ
కలిమి బలిమి పెరిగితే
ఆత్మ విమర్శ అంతర్ధానమైపోతుంది
అహంకారం వృద్ధి పొంది
ఆత్మీయతలను ఉరి తీస్తుంది
లేమి చెలిమికోసం చేతులు సాచుతుంది
లేకితనం లేని లేమిని భరించవచ్చు
కలిమిలోని కర్కశత్వం కన్న
జీవించినంతసేపూ ఎవ్వరూ అక్కర్లేదనుకోవడం
జీవి ఎగిరిపోయే ముందు అందరూ కావాలని కలవరించడం
మేధావులు సయితం చేసే పొరబాట్లు
సరిదిద్దలేని అగచాట్లు
నలుగురితో కలవని బతుకులు
ఒంటిస్తంభం మేడలోని కిరాయినవ్వులు
ప్లాస్టిక్ పూలకి గడ్డిపూల పరిమళం కూడా వుండదు కదా !
ప్రతిభ అంతా ఉండచుట్టుకుని
చందమామలా వెలగొచ్చు కాని
అభిమానాలూ, ఆత్మీయతలూ రవంతైనా తొంగిచూడవు
అన్నీ వున్నా అవి ఒంటరి బతుకులే
ఇదే.... ఇదొక్కటే తెలుసుకుంటే...!!

—శారదా అశోకవర్ధన్

తన సహనమూ, విధేయతా, మాటతీరులో ఉట్టిపడే సంస్కారమూ చూస్తుంటే, కులాల్ని బట్టి మనిషినంచనా వేయకూడదు అనుకుంటుంటుంది శాంతమ్మ. లక్ష్మి అయిదోక్లాసు దాకా చదివింది. కాని అన్ని పుస్తకాలూ యిట్టే చదివెయ్యగలదు. రానురాను తమ యింట్లో లైబ్రరీలో ఏ కొత్త పుస్తకం వచ్చినా పిలిచి లక్ష్మికిచ్చేదాకా తోచని స్థితి ఏర్పడిందంటే అతిశయోక్తికాదు. పని చేసినంతసేపూ పని పిల్లవాడు పడుకుంటే పుస్తకం... అభినందించదగ్గవ్యక్తి లక్ష్మి.

చలపతి రచయిత అని తెలిసిన రోజున లక్ష్మి మొహంలో కదలాడిన సంభ్రమాశ్చర్యాలు తనెలా మరిచిపోగలదు.

''నిజమా అమ్మా! నేను కథలు రాసే అయ్య యింట్లో పనిచేస్తున్నానంటే నాకే గర్వంగా వుంది'అన్నది ఆమెగర్వంమాట ఎలా వున్నా ముందు తను ఉప్పొంగి పోయిందా మాటలకి.

లక్ష్మికి ఆయనంటే గౌరవం పెరిగి పోయింది. బాబు గారి కథ పడిందంటే చాలు, చేస్తున్నపని మానేసి చక్కావచ్చి ఆ కథ చదివేసి మరీ వెళ్తుంది. ''లక్ష్మి మీ ఫ్యాన్ అయిందండీ" అంది తను నవ్వుతూ భర్తతో. ఇంతలో "టెలి గ్రాం" అని వీధి వాకిట్లోంచి కేక వినిపించింది. పరుగున వెళ్ళి సంతకం పెట్టి టెలిగ్రాం తీసు కుంది శాంతమ్మ .అదిరే గుండెలతో, వణికే చేతులతో విప్పి చదివిన శాంతమ్మ ముఖంలోకి వేయి దీపాల కాంతి సర్రన దూసుకొచ్చింది. పేరు పొందిన ఓ మాసపత్రిక నిర్వహించిన కథల పోటీలో చలపతి రాసిన కథకు ప్రథమ బహుమతి రావడం, ఆ టెలిగ్రాంలో సారాం శం. చలపతి చాలా కథలే రాశాడు గాని, బహుమతి రావడం అదే మొదటిసారి.

శాంతమ్మ సంతోషానికి ఉత్సాహానికి ఇంక పట్టపగ్గాలు లేకుండాపోయాయి. దానికి కారణం కూడా వుంది. బద్ధకించి చలపతి బీరువాలో వుంచిన రఫ్ ప్రతిని ఫెయిర్‌చేసి పంపిన ఘనత శాంతమ్మదే. చలపతి కూడా చాలా సంతోషించాడు తనకథకి బహుమతి వచ్చినందుకు. టెలిగ్రాంతో సహా చాటంత మొహంతో, పెరటి వైపు వెళ్ళి "లక్ష్మి" అని కేకేసింది. రాముడు పనికెళ్ళిపోయినట్టున్నాడు తీరుబాటుగా తల దువ్వుకుంటున్న లక్ష్మి వున్న పళంగా పరుగెత్తుకొచ్చింది "ఏమిటమ్మ గారూ! చాలా హుషారుగా వున్నారే..." నవ్వుతూ అంది. "అవును లక్ష్మీ! మాంచి సంతోషకర మైనవార్త–అయ్యగారి కథకి బహుమతి వచ్చింది తెలుసా? ఉత్తబహుమతి కాదు, మొదటిబహుమతి. అయిదువేలు" శాంతమ్మ కళ్ళు మెరిసి పోతున్నాయి,. కంఠంలో దాచు కుందామన్నా దాగని ఆనంద ప్రకంపనాలు

"అయిదువేలే" లక్ష్మి చెయ్యి గుండె మీదికి పోయింది "చాలా మంచి కథ రాశారన్న మాట అయ్యగారు కథపేరేమిటమ్మగారూ?"

"బాగుపడని అతుకులు"

"అదేమిటమ్మా?"

"కథ పేరు లక్ష్మీ! ఈ సారి అయ్యగారు పేదల జీవితమే యితివృత్తంగా తీసుకుని రాశారు కథ. కాస్త దయనీయంగానే వుందనుకో – కాని చాలా బావుంటుంది.

"అయితే చదవాల్సిందే" ఉత్సాహంగా అందిలక్ష్మి "అమ్మా ! ఈసారి పండక్కి నాకో కొత్త కోకన్నమాట"

"అలాగే లక్ష్మీ! అంది శాంతమ్మ ఎన్నడూ నోరు తెరిచి అడగని లక్ష్మి అడిగినందుకైనా, యీసారి ఆయనకా బహుమతి డబ్బు రాగానే ఓచీర కొనివ్వాలి. దాని చీరలు చూస్తే తనకే సిగ్గుగావుంది.

పేదలజీవితాలు అని వాపోతారు గాని మధ్యతరగతి వాళ్ళ జీవితాలేమంత సవ్యంగా వున్నాయని? ఆకాశానికంటే ధరలు

ప్రతినెలా లోటుబడ్జెటే అన్ని ఖర్చులూ పైనెల చూసుకొందాం అని నెట్టుకురావడం మధ్య తరగతి జీవులకే చెల్లింది. శాంతమ్మ తమ్ముడు శ్రీను వచ్చాడు. "రా రా, తమ్ముడు మంచి సమయానికి వచ్చావు, 'మీ బావగారు రాసిన కథకి ప్రథమ బహుమతి వచ్చింది" అంది సంతోషంగా ముఖం యింత చేసుకుని.

"ఈసారి ఏమూక గురించి రాశారు?" నవ్వుతూ నేఅడిగాడు శ్రీను బావగారూ అన్నీ పేదల యితివృత్తాలే ఎన్నుకుంటారని శ్రీనుకి హేళన. శాంతమ్మ ముఖం చిన్నబోయింది.

"అవును, ఆయనక్కసపడే మనుషులే వాళ్ళు. వాళ్ళ సమస్యలు తనవేననుకుంటారు. వాళ్ళకి జరిగే అన్యాయాలకి ఆవేశపడ్తారు సమాజపు యినప పాదాల క్రింద బలైపోకుండా, వాళ్ళనీ సాటి వాళ్ళగా గుర్తించి చాతనైన సహాయం చేయండి అని ఎలుగెత్తి చాటాలనుకుంటారు. సుందరభవంతులూ, అందమైన పూదోటలూ, హుండా గల కారులే జీవితం కాదని ఆయన ఉద్దేశం అదితప్పా?" అంది ఆవేశంగా "అక్కగారికి బాగా కోపం వచ్చినట్టుందే" చిరునవ్వుతో అన్నాడు శ్రీను. "నాకుతెలీకడుగుతాను కథలు రాసినంత మాత్రాన వాళ్ళ జీవితాల్లో మార్పువస్తే యింకేమండీ. బాగా ఐశ్వర్యమున్నవాళ్ళకి మరింత కూడ బెట్టాలన్న తపనే తప్ప యీ కథలు చదివి, స్పందించగల తీరికెక్కడుంటుంది? కడుపు నిండా తినడానికే నోచుకోని పేదవాళ్ళీ కథలు చదివి ముగ్ధులయ్యే అవకాశమేలేదు ఇకపోతే మీరూ, మేమూ చదువుకోవాలి. చదివి నిట్టూర్చడం తప్ప మనమేం చేయగలమక్కా, రెక్కాడితే గాని డొక్కాడని వాళ్ళం."

"అలాగనకు శ్రీనూ సాహిత్యం ప్రభావం సమాజం మీద చాలా వుంది. వంద కత్తులకి లేనిబలం ఒక కలానికున్నదన్నాడు ఓ మహానుభావుడు. అది ముమ్మాటికీనిజం ఓ రష్యన్ విప్లవానికీ, మరో ఫ్రెంచి తిరుగు బాటుకీ భారతస్వాతంత్ర్య సమరానికీ సాహిత్యం ఏమీ చేయలేదంటే నేను ఒప్పను. సాహిత్యం చదివే మధ్యతరగతినుండే చైతన్యకిరణం మెల్లగా మొదలై, మొత్తంసమాజాన్ని జాగృతం చేస్తుంది."

అక్కగారి ఆవేశం చాలా దూరమే పోయేలా వుందని గ్రహించిన శ్రీను, చేతులు రెండూ జోడించి, నాటకపక్కీలో అన్నాడు "అక్కాగారూ! మన్నించాలి. నేను ఈవూరు ఓపనిమీద వచ్చాను. స్నానం చేసి అర్జంటుగా వెళ్ళాలి. మరోసారి తీరిగ్గానీతో మాట్లాడుతా" శ్రీను అటు వెళ్లగానే శాంతమ్మ మరోసారి ఆ టెలిగ్రాంచూసిమురిసిపోయింది.

పండగకు ముందే పారితోషికమూ అందింది. బజార్లోకి పత్రికా వచ్చింది. ఇంటిల్లి పాది ఎంతో సంతోషించారు.

చలపతికి తన రచనాశక్తి పట్ల ఆత్మ విశ్వాసం పెరగడానికి దోహదమయింది ఆ కథ. ఆఫీసులోనూ, వీధిలోనూ అందరూ చలపతి సాధించిన యీ నూతన విజయాన్నే ప్రస్తావించుకుంటున్నారు "ఊరికే శుభవార్త చెప్పడమేనా? మానోట తీపి చేసేదేమన్నా వుందా?" ఆఫీసుస్టాఫ్ చుట్టుముట్టింది చలపతిని

"దానికేం భాగ్యం?" నవ్వుతూ అన్నాడు చలపతి.

"ఇంత పంచదార తెచ్చినోట్లో పోస్తావేమో. అదేం కుదర్దు.... మాంచి హోటల్‌కి తీసుకెళ్ళి పార్టీ యిప్పించాలి."

"అలాగే లెండర్రా" ఉత్సాహంగా అన్నాడు చలపతి.

పార్టీయిస్తే ఎటెండవడంతప్ప, పార్టీ ఎన్నడూ యివ్వలేదు చలపతి.

స్నేహితుల చతురోక్తులూ,ప్రశంసా వాక్యాల మధ్య అతనికి ఒళ్ళు తెలీలేదు మాట యిచ్చేశాడు.

విషయం విని శాంతమ్మ అంది "అంతమందికి హోటల్లో పార్టీ అంటే మాటలా? పోనీ మన యింట్లోనే ఏర్పాటు చేస్తే సరిపోతుందేమో...." "ఓశాంతా! ప్లీజ్.... యీసారికి పోనీ, మాటిచ్చేశాక వెనక్కితీస్తే బావుండదు"

శాంతమ్మ మాట్లాడలేదు. లోపల్లోపలే నిట్టూర్చింది. 'మధ్య తరగతి శుష్కాడంబరాలిలాగే వుంటాయి' అనుకుంది. పోనీ! తన కథకి బహుమతి వచ్చిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఇచ్చే పార్టీని తనెందుకు కాదనాలి?

మనవాడు పార్టీలో మొత్తం డబ్బు ఖర్చుచేసి యింటికొచ్చాడు

"అయ్యో, మొత్తం అవజేసి వచ్చారా? దాంట్లో మన లక్ష్మికి ఓకొత్త చీరకొని యిద్దామనుకున్నాను, పాపం ఎప్పుడూ నోరుతెరచి ఏవీ అడిగేదికాదు. మీకు బహుమతి వచ్చిన డబ్బులోంచి ఓ కొత్తచీర కొనివ్వాలి అంది. మీరేమో ఇలా చేశారు"అంది శాంతమ్మ నిట్టూర్పుగా లక్ష్మిపేరు వినగానే చలపతి కుతూహలంగా మారిపోయాడు.

"లక్ష్మి నాకథ చదివిందా శాంతా?"

"ఇదిగో ఇంతకుముందే చదువుతానని పట్టుకెళ్ళింది." బాబుగారు పేదోళ్ళ



శ్రీ రామానుజ ఫిలసాఫికల్ ఫౌండేషన్ ట్రస్ట్, విజయవాడ వారి ఆధ్వర్యంలో స్వర్గీయ త్రిదండపాణి కరుణాకర సూరిగారి 102వ జయంతోత్సవాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థులకు వస్త్రాలు, పుస్తకాలు బహుకరిస్తున్న డా॥బోయిన వెంకటేశ్వరరావు ఐ.ఏ.ఎస్, పూర్వ సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ. చిత్రంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీకర్పూరం వెంకటేశ్వర్లు, ఇంజినీర్ శ్రీటి.శోభనాద్రి, వస్త్రధార శ్రీ టి. శ్రీధర్‌లు చిత్రంలో ఉన్నారు.

జీవితాలంతా కళ్ళకి కట్టినట్లు రాస్తారు కదా నిజంగా వాళ్ళపేటకెళ్ళి తెలుసుకుని రాస్తా రామ్మా?" అని అడిగింది పిచ్చిరత్తాలు..." నవ్వుతూ అంది శాంతమ్మ. చలపతి కూడా నవ్వాడు "అమ్మగారూ! పుస్తకం" లక్ష్మిమాటవిని, యిద్దరూ ఒకేసారి తలతిప్పిచూశారు.

"నిండా నూరేళ్లాయుష్షు లక్ష్మీ! నీ విషయమే అనుకుంటున్నాం"

"కథ ఎలా వుంది?" అడిగింది శాంతమ్మ

"చాలా బావుందమ్మాగారూ! చదువు తున్నంతసేపూ కళ్ళలో గిర్రున నీళ్లు తిరగడమే. అయితే అయ్యాగారూ పేదోళ్ళ జీవితాలింక బాగుపడని అతుకు లేనంటారా?"

లక్ష్మి సూటిగా తననలా అడిగేస్తుందని అనుకోని చలపతి ఆ ప్రశ్నకి వెంటనే జవాబివ్వ లేకపోయాడు.

"పేదోళ్ళకి మనసనే దుంటుందిగదా అయ్యగారూ..... వాళ్ళకి ఎన్నో కలలూ, కోరికలూ వుంటాయి గదా. అవిగుర్తించి వాళ్ళ జీవితాలు బాగుపడే అతుకులేసుమా అనే వాళ్లుండరాబాబుగారూ?"

లక్ష్మి మాట స్వచ్ఛతకి అబ్బుర పడ్తూ చూస్తోంది శాంతమ్మ.

"ఎందుకుండరు లక్ష్మీ....! తప్పకుండా వుంటారు నాకథలో నేను చెప్పిందీ అదే బాగుపడని అతుకులని చేతులెత్తేయకుండా అవసరమైతే సరికొత్త అతుకుతో నూతన రూప మివ్వండి అని" లక్ష్మి సంతోషంగా, కృతజ్ఞతగా చూసింది. ఆకళ్లలో మెరుపు చలపతి హృదయపు లోతుల్ని స్పృశించింది. లక్ష్మివెళ్ళిపోతూంటే అటే చూస్తూ కూర్చున్నాడు.

ఆరోజు పని చేయడానికి రాలేదు లక్ష్మి వాళ్ళ పాకముందు కూడా కళ్ళాపి చల్లి ముగ్గేసిన జాడలులేవు. ఖంగారు పడ్తూ పాక దగ్గర కెళ్ళింది శాంతమ్మ. సంకోచిస్తూనే. లోపలికి తొంగిచూస్తూ 'లక్ష్మీ' అని చిన్నగా పిలిచింది. నులక మంచం మీద మోచేతుల మధ్య బోర్లాపడుకుని, తల దాచుకుని ఏడుస్తున్న లక్ష్మి ఆ పిలుపుకి చటుక్కున లేచింది. జుట్టు కొసలు సరిచేసుకుని, కళ్లుగట్టిగా కొంగుతో అద్దుకుని, గుమ్మం దగ్గర కొచ్చింది. శాంతమ్మని చూడగానే దుఃఖం ఆగలేదు. బావురుమంది ఒక్కసారిగా

"ఏమైంది లక్ష్మీ?"

"అమ్మగారూ! రాముడు నన్ను ఒగ్గేసి వెళ్ళిపోయాడమ్మా మరో దానితో" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది "ఆ" ఆవార్త షాక్‌లా అన్పించింది శాంతమ్మకి.

తన దృష్టిలో లక్ష్మి, రాముడూ అన్యోన్యదంపతులు. ఆ జంటచూసి తనెంతో ముచ్చటపడేది.

"వాడికుండుండి యిలాంటి బుద్ధి పుట్టిందేమిటి? బంగారంలాంటి పెళ్ళాన్ని వదిలి పెట్టిపోయాడు. మీరిద్దరూ మాటా మాటా అనుకోగా కూడా చూడలేదే నేను...."

నాఖర్మ అమ్మగారూ.... నాఖర్మ...." నుదురుకొట్టుకుంది లక్ష్మి అంతకన్నా మరో మాట మాట్లడలేదు.

"పిల్లవాడు సొమ్మసిల్లి పడుకున్నాడు. పాలేమన్నా పట్టావా?"

లక్ష్మికప్పటికిగాని పిల్లాడి ధ్యాస కలగలేదు. ఒక్కవుదుటున వెళ్ళివాడిని భుజాన వేసుకుంది. "ఎన్ని కలలు కనే వాళ్ళమమ్మా వీడి గురించి. ఎంత నిర్దయగా వెళ్ళిపోయాడు. మగాడు తెంచుకున్నంత సులభంగా ఆడది తెంచుకోగలదమ్మా బంధాన్ని? అనుమాసం రానేకూడదమ్మా ఎవరికీ. అది వస్తే మనిషి రాక్షసుడైపోతాడు. ఎంత ప్రేమించానమ్మావాడ్ని నేను తప్పుదారి పోతానని ఎట్టాగనుకున్నాడు? దాన్ని కట్టుకుంటానంటే కాదన్నానా? లేని నింద మోపడమెందుకమ్మగారూ?" అంటూనే ఏడు స్తోంది లక్ష్మి శాంతమ్మకి వ్యవహారం అర్థమై పోయింది" బాధపడకు లక్ష్మీ! వాడి తప్పువాడే తెలుసుకుంటాడులే. పిల్లవాడిని చూసైనా నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి" ఓర్పుగా అంది.

చలపతి విషయం విని చాలా బాధ పడ్డాడు.

"ఒక్కతే ఆ పాకలో ఏముంటుంది? మనపెరట్లో ఆరేకులగది ఖాళీయేగా. ఆ చెత్తా చెదారం తీసేసి శుభ్రం చేయిస్తే అక్కడ వుంటుంది. ఒంటరి స్త్రీ రక్షణ లేనిస్త్రీ అని తెలిస్తే యీ వెధవ సమాజం వూరుకుంటుందా?" అన్నాడు. ఆ మాటలకి శాంతమ్మకి చాలా సంతోషంవేసింది. ఆసంతోషం బాష అనువ దించలేనిది. తనమనసులో మెదులుతోన్న విషయంలా చెప్పాలో, చెప్తే భర్త ఒప్పుకుంటాడో లేదో అన్న మథనం అంతటితో తీరిపోయింది.

శాంతమ్మచెప్పింది విన్న లక్ష్మిముందు కలవరపడింది. ఆశ్చర్యపడింది. ఆతర్వాత సంతోషపడనూ పడింది ఆ ఆదరానికి. కాని వెంటనే వస్తానని మాత్రం అనలేదు. "వద్దు లెండమ్మామీకామాత్రం జాలివుంది నామీద. అది చాలమ్మా నాకు, అదే పదివేలు ఈ దురదృష్టపు దాన్ని మీరు మాత్రం ఎన్నాళ్లు భరిస్తారమ్మా?" "అలా అనకు లక్ష్మీ నువ్వు మా యింట్లో వుండడం మాకు భారమేమీకాదు అసలు యీ ఆలోచన నాదిగాదు తెలుసా.... అయ్యగారే అన్నారు లక్ష్మీ! నీకు తెలీదు, ఆయన మనసు చాలా మంచిది. నేనిన్నాళ్ళు ఆయన రచనలు చదివి అనుకుంటుండే దాన్ని. అంత ఔదార్యం అంత సహృదయతా నిజ జీవితంలో ప్రదర్శించగలరా అని. ప్రదర్శించడం కష్టసాధ్య మని నాలో నేను అనుకునే దాన్ని కాని నేను పొరపడ్డాను లక్ష్మీ ఆయన లాంటి వారు కాదు కనీసం నువ్వు మారు మనువాడే దాకానన్నా మారక్షణలో వుండు. శాంతమ్మ మాటలకి మధ్య అడ్డమొచ్చింది లక్ష్మి, "మారు మనువు మాలో వుందిగాని నాకే యిష్టం లేదమ్మగారూ. యిరిగి పోయిన మనసుతో కాపురం చేయడం నావల్ల కాదు అమ్మగారూ! కన్నందుకు వీడిని పెంచి మంచి చదువు చెప్పించాలని వుంది అదేనమ్మా నాకోరిక"

"ఆ కోరిక తీరేందుకైనా మా యింట్లో వచ్చివుండు. తలకిమించిన సహాయమైతే మేం మాత్రం చేస్తామా లక్ష్మీ?"

మొత్తం మీద లక్ష్మి వాళ్ళింట్లో వచ్చి వుండడం ఖాయమైంది. పనిచేసినంతసేపూ పని చేసుకుపోతుంది. ఏమాత్రం తీరుబాటున్నా శాంతమ్మనే పత్రికో పుస్తకమో అడిగి తీసుకుని బాదం చెట్టునీడలో కూర్చుని చదువుకుంటూం టుంది లక్ష్మి అప్పుడప్పుడూ ఏ బియ్యమో, పప్పులో బాగు చేస్తున్నప్పుడు శాంతమ్మకి తన

తన కలలూ, కల్లలూ నివేదిస్తుంటుంది. "మా కొడుకుని బాగా చదివించాలన్నదే నమ్మా మా యిద్దరికోరిక. ఎన్నెన్ని కబుర్లు చెప్పేవాడినమ్మా వీడి గురించి! అన్నీ గాలి కొదిలేసి, నన్ను నాపాట్లకి వదిలేసి వెళ్ళిపోయాడు. అయితే ఏమయిందమ్మా నాకొడుకుకి నేనులేనా? తల్లీ తండ్రీ నేనే అయి పెంచుకుంటా నమ్మా మీ లాంటి చల్లని తల్లుల రక్షణ వుంటే, మాకేం లోటు లేదు" అంది ఓరోజు లక్ష్మి తను చదువుకోకపోయినా కొడుకుని బాగా చదివించు కోవాలన్న దాని ఆశయంలో వుదాత్తతా, కష్టకాలంలో కూడా సడలని ఆత్మ విశ్వాసం శాంతమ్మకి ప్రశంసనీయంగా అన్పించాయి.

ఏ దోపని మీద పెరటి వైపు వచ్చిన శాంతమ్మ అక్కడి దృశ్యం చూడగానే ఆశ్చర్యంగా ఆగిపోయింది.

చలపతి బావిలో నుండి బకెట్‌తో నీళ్ళుతోడి గంగాళంలో పోస్తున్నాడు.

"ఇంక చాల్లెండి బాబుగారూ! నేను తోడుకుంటానెళ్ళండి. ఆఫీసుటైం అవుతుందని తర్వాత నన్ను తిట్టుకుంటారు" చిరునవ్వుతో అంటోంది లక్ష్మి. తోమిన పాత్రలు తొలుస్తూనే సాధారణంగా ఆగంగాళం నింపడం లక్ష్మి పనే. అలవాటుకి విరుద్ధంగా ఆపని చలపతి చేయడం శాంతమ్మకి ఆశ్చర్యంగా కాక మరెలాగుం టుంది? చలపతి చూడనే చూశాడు శాంతమ్మని "పాపం లక్ష్మిచేతి మీద బొబ్బ లెక్కాయి శాంతా.... అలాగే చేసుకుపోతోంది పని. ఆ నులక తాడు ఒరుసుకుని మరింత నెప్పి వస్తుందని.... ఓనాలుగు బకెట్లుతోడి పోశాను" అన్నాడు సంజాయిషీ యిస్తు న్నట్లు శాంతమ్మ ముఖంలోకి చిరు నవ్వు పాకివచ్చింది "అయ్యగారి జాలి నాకు తెలీదా? అది సరే లక్ష్మీ, నీ పనికాగానే గుర్తు చేయి. ఆ దెబ్బేదోచూసి మందు రాస్తాను. అనేసి వెళ్ళిపోయింది.


ఒక్కవంటతప్ప మిగతా అన్ని పనులూ చక్కదిద్దుకు పోతుంది లక్ష్మి సమర్థ వంతంగా.

"లక్ష్మీ ఇంత సాయం చేస్తున్న నీ ఋణమెలా తీర్చుకోగలనే" అంది శాంతమ్మ "తప్పు అమ్మగారూ! పెద్దవారు, నాకింత ఆశ్రయ మిచ్చినవారు. అలాగనకండి. ఋణం మాట కొస్తే నేనే మీకు....." "చాల్లే యింక" నవ్వుతూ కసిరింది శాంతమ్మ "లక్ష్మీ" ఒక్క టడుగుతాను. ఏమీ అనుకోకు. రాముడు మొహం చూపించి చాలారోజులైంది. ఇకరాడనే అన్పిస్తోంది. పోనీ వీరయ్య వాళ్ళక్క చేత అన్ని సార్లు కబురు చేశాడుగదా" అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది.

"నాకు తెలుసమ్మా. మీరడగ బోయేది ఎందుకు మనువాడ కూడదు అనేగదా రెండ్రోజులు పోతేవాడు మాత్రం అలా చేయడని నమ్మకమేమిటమ్మగారూ? వద్దు వద్దమ్మా. నాకు మనువంటేనే మోజు చచ్చిపోయింది. బాబు గారన్నట్టు కొన్ని కొన్ని జీవితాలు బాగుపడని అతుకులేనమ్మా" అంటుంటే లక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చటుక్కున వంగి శాంతమ్మ పాదా లకు దండం పెట్టింది. "మీ నీడనుండి మాత్రం తొలగి పొమ్మని చెప్పకండి. అదొక్కటేనమ్మా నేను కోరేది"

"ఛ, ఏమిటిది లక్ష్మీ చాదస్తం" మంద లింపుగా అంది శాంతమ్మ

"నీకా భయమేమీవద్దు. వయసులో వున్నదానివి... చక్కనిదానివి... జీవితం వృధా చేసుకుంటావేమోనన్న బాధతో అన్నానంతే నువ్వుంటే మాకేం కష్టం" కళ్ళనీళ్ళు తుడుచు కుని అంది లక్ష్మి.




"నాజీవితం వృధా ఎందుకవుతుం దమ్మగారూ? దేవుడు నామీదే బరువుపెట్టాడు. (కొడుకుని దగ్గరకు లాక్కుని) కాస్తో కూస్తో రాయనూ చదవనూ వచ్చినందుకు మంచి మంచి పుస్తకాలు చదువుకుంటాను. మనిషికి పెళ్ళి ఒక్కటే ముఖ్యం కాదుగా అమ్మగారూ లక్ష్మివైపు విప్పారిన నేత్రాలతో ఏదో అద్భుతాన్ని చూసినట్టు చూసింది శాంతమ్మ. అవును, లక్ష్మి అన్నట్టు జీవితం వృధా అని ఏ జీవి మాత్రం ఎందుకనుకోవాలి? చేసే సంకల్పం వుంటే ఎన్ని మంచి పనులన్నా చేయవచ్చు. నిరాశ ఏ వైపు మనస్సుని కృంగదీస్తున్నా, దాన్నధిగమించి నిబ్బరంగా నిలవాలన్న ప్రయత్నం చేసేలక్ష్మంటే శాంతమ్మ హృదయంలో వున్న స్థానానికి మరి కాస్త వైశాల్యం పెరిగింది.

"లక్ష్మీ"

చిక్కటి చీకటిలో కొడుకుమీద చెయ్యేసి ఆరేకులగదిలో ఆద మరచి నిద్రపోతున్న లక్ష్మికి అతి మంద్రస్థాయిలో వున్న ఆపిలుపు విన్పించలేదు మొదట.

"లక్ష్మీ!" కాస్త స్వరం హెచ్చిందీసారి.

లక్ష్మి వులిక్కిపడి లేచింది నిద్రకళ్ళకి క్షణకాలం ఏమీ కన్పించలేదు.

భుజంమీద బరువుగా ఎవరిదో చెయ్యి పడింది.

లక్ష్మి గుండె దడదడలాడింది. ఊపిరి తీయడం మరచిపోయిన దానిలావుండి పోయింది.

"ఎవరు?"అంది కాస్సేపటికి లేని ధైర్యాన్ని చిక్కబట్టు కుంటూ. ఆ వచ్చిన వ్యక్తిని పరీక్షగా చూసే ప్రయత్నం చేస్తున్నాయామె కళ్ళు

"భగవంతుడా! నన్ను కాపాడు" దీనంగా ప్రార్థించు కుంది మనసులో.

"లక్ష్మీ! నేనే"

లక్ష్మి గుర్తు పట్టగలి గింది.

"అయ్యగారూ! మీరా? ఇంతరాత్రి వేళ"

చలపతి చిన్నగా

నవ్విన ధ్వని విన్పించింది.

"ఏం రాకూడదా లక్ష్మీ?" రెండోచెయ్యి కూడా పడింది లక్ష్మిభుజంమీద. సరసాలకూ, సరదాలకూ యింతకన్నా అనువైన సమయ మేముంటుంది? చుక్కలచీర నీకెంత ముచ్చటగా వుందో తెలుసా? లక్ష్మీ? నువ్వసలు గుడిసెల్లో పుట్టాల్సిన దానివి గావే...నీ అందం నన్ను కాలు స్తోంది. లోలోపల నన్ను కొరుక్కు తినేస్తోంది. నిగ్రహించుకోవడం నావల్ల గావడం లేదు?

చలపతి కంఠంలో తీవ్రమైనఆకాంక్ష కోరికతో కూడిన అతని శరీరం కాలిన పెనంలా వుంది. లక్ష్మికి తను చూస్తోంది కలా నిజమా అన్పిస్తోంది. ఈ అయ్యగారిని తనెంత నెత్తిన పెట్టుకుంది మనసులో.... తనమీద అభిమానం చూపిస్తోంటే ఎంత మురిసిపోయింది. ఫర్వా లేదు.... మొగుడు అన్యాయం చేసినా, దేవుడు మరోరకంగా. అండ చూపాడని ఎంతో సంతోష పడిపోయింది. ఆ సంతోషమంతా మిధ్యేనా? అయితే అయ్యగారు పేదలపట్ల చూపే జాలి కథలకే పరిమితమా. నిస్సహాయు రాలైన స్త్రీని చూస్తే ఈ అయ్యకీ లోకువేనా? ఎటువైపు నుండీ రక్షణ లేక సమాజం చేత తరుమబడిన ఓ స్త్రీ జీవితాన్ని ఎంతో మనసు కదిలేలా చిత్రీక రించిన ఆ బాబుగారూ ఈ బాబుగారు ఒకటి కాదా? లక్ష్మి కళ్ళు గండిపడిన చెరువులే అయి నాయి. నెమ్మదిగా చేతులు జోడించింది. "బాబు గారూ! మీరు మీరు నన్ను తాకి మైల పడకండి బాబూ! చేతులెత్తి దండం పెడ్తున్నాను. గొప్ప కులంలో పుట్టినవారు. మంచీ చెడు తెలుసు. అమ్మగారు దేవతలాంటివారు. ఆదేవతకన్యా యం చేయకండి" "ఇందులో దాని కన్యాయం చేయడమేముంది లక్ష్మీ? శాంత నువ్వన్నట్టు దేవతే. నేను నీమీద మనసు పడినట్టు ఏమాత్రం గ్రహించినా కట్టుచేయదు. చూడు లక్ష్మీ యిన్ని నెలలయింది వాడు నీవేపన్నా చూశాడా? నీ వయసువేడి కోరికలవాడి ఎన్నాళ్ళణచుకోగలవు నువ్వుమాత్రం? నామాటకాదనకు లక్ష్మీ..... ఇదంతా అతి రహస్యంగా జరిగిపోయేలా చూస్తాను. దీనికి ప్రతిఫలం లేదనుకుంటున్నా వేమో నీకొడుకునెంతదాకా చదివించమంటే అంతదాకా చదివిస్తాను. నిన్నన్నివిధాలా కని పెట్టివుంటాను" ఎన్నికల ముందు ఓట్ల కోసం అభ్యర్థులకుచేసే వాగ్దానాల్లా వున్నాయతని మాటలు. అంత దుఃఖంలోనూ నవ్వు వచ్చింది లక్ష్మికి.

"నా కొడుకుని చదివించుకోడానికి ప్రక్కదారులు నాకొద్దు బాబుగారూ! నా వయసూ కోరికా అంటే మీకెంతజాలి? నిజంగా అదే నన్ను బాధిస్తుంటే మారు మనువేనాడో చేసుకునే దాన్ని బాబుగారూ!

అమ్మగారు మీరంటే గొప్ప అభి ప్రాయంతో వున్నారు. అది చెడ గొట్టుకోకండి. పాలలాంటి కాపురంలో యీ విషపుబొట్టు వద్దు..." చలపతికి ఆ మాటలు వినగానే ఛర్రున కోపం వచ్చింది

ఒక్కగుంజుతో లక్ష్మిని లాక్కున్నాడు మీదికి.

కథలు చదివిన తెలివి బాగానే ప్రదర్శి స్తున్నావే... పెద్ద పతివ్రతవి పోగయ్యావ్... మమ్మల్ని కాదని పోతే, కుక్కకన్నా హీనమై పోతుంది నీబ్రతుకు. గుట్టుచప్పుడు కాకుండా లొంగిపో"

లక్ష్మి లొంగిపోలేదు. పిచ్చిబలంతో అతన్ని తోపు తోసి, బెదరే గుండెలతో గది దాటి పెరట్లోకి పరుగుదీసింది.

చలపతి వూహించని యీచర్యకు దిమ్మెరపోయాడు.

లక్ష్మికి తనంటే వున్న ఆరాధన వల్ల తేలిగ్గా లొంగిపోతుందనుకున్నాడు. కాని జరి గిందేమిటి? ఈ రోజుకోసం తానెంతగా ఎదురు చూశాడు? గాని, ఏంలాభం? ఛాన్స్ మిస్సయింది.

కాస్సేపటికి చలపతి గబగబా యింటి వైపు నడుస్తూ వెళ్ళిపోయాడు. బావి వెనక దాగిన లక్ష్మిగానీ, చలపతినిగానీ యీ సంఘట నకి మరో జత కళ్ళు సాక్షీభూతంగా వున్నాయని గమనించలేకపోయారు "ఛ....... ఛ..... డర్టీ క్రీచర్స్. కొంపకొస్తే ఓశుచీ శుభ్రతా కన్పించి చావదు అలగాజనంది" చిన్నగా విసుక్కుం టున్నా, అవి వినబడాల్సిన వాళ్ళకి బాగానే విన్పిస్తున్నాయి. లక్ష్మి నిశ్శబ్దంగా వచ్చి నట్టింట కూర్చున్న కొడుకు నెత్తుకుని తీసుకెళ్ళిపోయింది.

"శాంతా! పెరటివైపున్న ఆరేకులగది మా ఆఫీసు ఫ్యూన్ శివయ్యకి కావాలట" శాంతమ్మ నింపాదిగా అంది" వీలుగాదని చెప్పండి లక్ష్మి అర్థాంతరంగా ఎక్కడికి వెళ్ళి వుంటుంది?"

ఎన్నాళ్ళుంటుందిట అయితే?" తీవ్రత ధ్వనించిందతని కంఠంలో ఎన్నాళ్ళయినా వుంటుంది. ఆరక్షణ యిచ్చే ఉద్దేశంతోనే కదా వచ్చివుండమన్నది"

'రక్షణ" నిరసనగానవ్వాడు చలపతి. "తెగింపు స్వభావం గల ఆడదానికి రక్షణ అనవసరం. మనమింకా తెలుసుకోలేకపోయాం శాంతా... సోమయ్య చెప్పాడు. నడతమంచిది కాదనే దాన్ని మొగుడొదిలేసి వెళ్ళాడట" శాంతమ్మ సూటిగా ఒక సారి భర్త ముఖంలోకి చూసింది. "చాలా కష్టపడి సేకరించాడే పాపం వార్త! కళ్ళారా చూస్తేగాని నమ్మమని చెప్పండి."

శాంతమ్మ మరో మాటకవకాశం లేకుండాలోపలికి వెళ్ళిపోయింది. మర్నాడు యథాప్రకారం లేచి పనులన్నీ చేసుకుపోతున్న శాంతమ్మ పెరటిగుమ్మంవైపు వచ్చి నిలబడిన ఆ జంటని చూసి ఆగిపోయింది.

"అమ్మగారూ!" అంటూ వచ్చి పాదాభి వందనం చేసింది లక్ష్మి.

"వీరయ్యండీ, తెల్లవారు ఝామున కాళికా గుడిలో పెళ్ళిచేసుకున్నాం."

శాంతమ్మకి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆప్యాయంగా దగ్గరకి లాక్కుని లక్ష్మిని హత్తుకుంది హృదయానికి.

ఆ స్పర్శకే భాషనేదుంటే, అది యిలా వుండేది.

"లక్ష్మీ! నీ స్వభావమెంత ఉదాత్త మైనదే! అయ్యగారి స్వభావం చెప్తే, నేనెక్కడ కించపడ్తానో అని మౌనం వహించావు. నా కాపురం చల్లగా వుండాలని,కావాలని దూరంగా వెళ్ళిపోతున్నావు. ఎక్కడున్నా నీప్రవర్తన మరిచి పోనే లక్ష్మీ ! సుఖంగా,హాయిగా వుండు కలకాలం"

వెళ్ళిపోతున్న వారిద్దర్నీ చూస్తుంటే శాంతమ్మకి ఓవైపు మహారణ్యం తగలబడి పోతూంటే, మరోవైపు సుమవనం పుష్పిస్తున్న అనుభూతి కలిగింది.